# భగవదర్పితముగా కర్తవ్యం చెయ్యండి

ఈ ప్రపంచములో కొన్ని ఆదర్శములతో నివసించే మానవుడు వానిని ఆధ్యాత్మికతతో సమ్మిళితం గావించాలి. నిత్యము తెల్లవారిమొదలు మనం చూస్తున్నాము. ఒక పోస్టుమాన్ ఒక ఇంటికి ఒక కవరు ఇచ్చి పోతాడు. రెండవ ఇంటికి వారి ఎడ్రసుకు సంబంధించిన మరొక కవరు ఇచ్చిపోతాడు. ఈ విధముగా వారి వారి విలాసముల ననుసరించి ఒక్కొక్కరికి ఒక్కొక్క కవరు ఇచ్చి పోతుంటాడు. ఒక ఇంటిలో ఆ జాబును చించి చూసి అందరు గొల్లున ఏడుస్తారు. రెండవ ఇంటిలో అందరు చూసి ఫక్కున నవ్వుతారు. ఒక ఇంటివారు నవ్వటానికి, మరొక ఇంటి వారు ఏడవటానికి పోస్టు బంట్రోతా కారణం. కాదు. కాదు. ఆ ఇంటి వారికి వచ్చిన జాబుయొక్క ప్రభావమే ఈ ఏడుపుకు, ఆనందమునకు ముఖ్యకారణము. అదే విధముగా భగవంతుడు ఒక పోస్టలు బంట్రోతు. మీ మీ కర్మానుసారంగా వచ్చిన లెటర్సును సుఖము, దుఃఖము మీరనుభవిస్తారుగాని భగవంతునకే మాత్రం సంబంధము లేదు. దాని వల్లనే కర్మాను బందీని మనుష్యలోకే మానవుడు చేసిన మంచి చెడ్డలయొక్క కర్మ ఫలితము అనుభవించక తప్పదు. అని భారతీయులయొక్క నమ్మకము.

కాని తమ తమ ధర్మములయొక్క విశిష్టతనుగాని, విశేషమునుగాని లేక విషయాన్నిగాని గుర్తించటానికి ప్రయత్నించక కేవలం భగవంతుని నిందించుతున్నారు. ఇది కేవలం అజ్ఞానముయొక్క ప్రథమస్థానము. తన దోషములు తాను గుర్తించటానికి ప్రయత్నించక భగవంతునిపై దోషములు వేయటానికి పూనుకోవటం అజ్ఞానము. నీ అడ్రసుకు వచ్చిన జాబు తెచ్చి ఇచ్చాడు బంట్రోతు. అంతే గాని వ్రాసిన వారియొక్క కష్టసుఖములను నీవు తలచుకొని సుఖదుఃఖములకు లోనవుతున్నావు.

**జనని గర్భము నుండి జన్మించినప్పుడు**
**కంఠమాల లేని కానరావు**

sri sathyasai vachanamrutam

**మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు**
**మేల్మి బంగరు దండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పొదగలేదు**
**వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు**
**గోమేధికంబులు తోడలేవు**
**కలదు కలదొక్కమాల మీ కంఠమందు**
**పూర్వజన్మల కర్మలను పొందుపరచి**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల.**

కనుక ఆ మాలను మీరు ధరించి వస్తున్నారు ఇక్కడికి. కనుక మీరు మీకు ధరించిన హారమే కాని మకొకరు వేసిన హారం కాదు. కనుక ఇట్టి మంచి చెడ్డలను పరిష్కారం గావించుకొను నిమిత్తమై భగవంతుని ప్రార్థించటం కర్తవ్యము.

పూర్వం త్రేతాయుగములో రాక్షసులందరు ఒకవైపున, దేవతలందరు ఒక వైపునఉండేవారు. దండకారణ్యములోను, లంకలోను రాక్షసులుండేవారు. అయోధ్య కిష్కింధలో దేవతలుండేవారు. వారు వేరుగా, వీరు వేరుగా ఉండటం చేత దేవతలకు సహాయపడే నిమిత్తమై భగవంతుడవతరించి దేవతలకు సాయంగా నిలచి రాక్షసులతో యుద్ధము సల్పి విజయాన్ని సాధిస్తూ వచ్చారు. త్రేతాయుగములో దేవతలు వేరు, రాక్షసులు వేరుగా ఉండేవారు. ద్వాపర యుగమయ్యేటప్పటికి దేవతలు రాక్షసులు ఒకే ఇంటిలో నివసించటానికి ప్రయత్నించారు. ఎట్లనగా దేవకీదేవి దేవతా స్వరూపము. ఆమె సోదరుడైన కంసుడు రాక్షసుడు. పాండవులు దేవతా స్వరూపులు. కౌరవులు రాక్షస స్వరూపులు. ఈ విధముగా ఒకే కుటుంబములో ఈ దేవతలు రాక్షసులు కలసి జీవిస్తున్నారు. అప్పుడు భగవంతుడు యుద్ధము చేయటానికి వీలుకాదు. అందువలనే కృష్ణుడు కౌరవులకు సైన్యమిచ్చి పాండవులకు తానే కత్తిపట్టనటువంటి సారథ్యం వహించాడు. అస్త్రసన్యాసం చేశాడు. నాయనా! మీ మంచి చెడ్డలు మీకు. మీరే పోరాడి విజయాన్ని

sri sathyasai vachanamrutam

సాధించుకోండి. నేను కేవలం సాక్షీభూతుడుగా ఉంటాను అన్నాడు. కలియుగము ప్రారంభమయ్యేటప్పటికి ఈ దేవతలు, రాక్షసులు ఒకే దేహంలోనే ఉంటూ వచ్చారు.

త్రేతాయుగములో వేరువేరు దేశములలో నివసిస్తూ వచ్చారు. ద్వాపర యుగంలో ఒక ఇంటిలో నివసిస్తూ వచ్చారు. కలియుగములో ఒక దేహములో నివసిస్తూ వచ్చారు. కనుక ప్రతి మానవునియందు రాక్షసత్వము దైవత్వము రెండూ కలసి జీవిస్తూ వస్తున్నాయి. కనుక ఇక్కడ కూడా భగవంతుడు కేవలం సాక్షీ భూతుడుగా ఉన్నాడు. ఎవరెవరి కర్తవ్య బలాన్ని పురస్కరించుకొని వారికి విజయాన్ని అందిస్తూ ఉంటాడు.

**భగవంతుడు పోస్ట్‌మేన్ వంటివాడు**

అదే విధంగా పోస్టుమేన్ ఏమి చేస్తుంటాడు. ఎవరెవరి అడ్రసులకు వారి లెటర్సు ఇస్తూ పోతూఉంటాడు. అతడు సాక్షిభూతుడే. అయితే మనం వ్రాసే జాబు లకు ఒక నిబంధన వుంది. మనము ఎంత చక్కని వ్రాత వ్రాసి, అందమైన అక్షరాలు వ్రాసి చక్కని పేపర్లో వ్రాసి కవరులో పెట్టిన పైన అడ్రసు కనుక వ్రాయకపోతే అంతా వ్యర్థమైపోతుంది. అట్లు కాకుండా మన అక్షరాలు చాలా అసహ్యముగా వుండి, చూచుటకు, చదువుటకు వీలుకాని అక్షరాలైన కవరుపైన అడ్రసు వ్రాసిన అది నేరుగా అక్కడకు వెళ్ళిపోతుంది. ఇంకా కవరుపైన స్టాంపు వుండాలి. స్టాంపు అతికించి, అడ్రసు వ్రాసి పోస్టు చేస్తే వేయిమైళ్లయినా, రెండువేల మైళ్లయినా, ఐదువేల మైళ్ళయినా అది వెళ్ళిపోతుంది. స్టాంపు అతికించకపోతే పక్కింటికి కూడా పోయిచేరదు. ఈ స్టాంపు అంటే యేమిటి? చిత్తశుద్ధి.

ఇప్పుడు ఈ హాలంతా పెద్ద Pure White Paper Clean గా ఉండేది. దానిని నీకిస్తే టేబులుపైన మడచిపెట్టి పేపర్ వెయిట్ దాని పైన పెడతారు. కాని 3/5 సైజు నూరు రూపాయలనోటు కవరు ఇస్తే చాలా dirtyగా ఉంది. అది నీకిస్తే నీవేమి చేస్తావు. దానిని గోద్రెజ్ బీరువాలో పెట్టి లాక్ చేస్తావు. అంతకంటె వేయింతలు white paper ఇచ్చినా నీవు లెక్క చేయలేదు. దానిని పారవేస్తున్నావు. ఈ dirty paper ఎమేమో oil అయిపోంది. ఏమోమో లెక్కలు కూడా దానిపైన వ్రాశారు. ఇలాంటి dirty paperను తీసుకుపోయి గోద్రెజ్‌లో పెట్టి లాక్ చేస్తున్నావు. వీటి విలువకు కారణమేమిటి? అదే Reserve Bank Stamp



sri sathyasai vachanamrutam

వుంది. దానిపైన ఆ stamp ఉండటంవలనే అంత dirty paperకు అంత విలువ వచ్చింది. దీనిపై ఆ stamp లేదు కనుక ఇంత పవిత్రమైనది. ఇంత పరిశుద్ధమైనది విశాలమైనది అయినప్పటికి విలువలేకుండా ప్రక్కనపెట్టేస్తున్నావు.

**ఏమి చూసుకొని అహంకారము?**

కనుకనే ఆళ్వార్ చెప్పారు. భగవంతుడా! నా చిత్తశుద్ధితో నిన్ను పూజ చేస్తున్నాను. ఆ చిత్తశుద్ధి అనేది విలువైన స్టాంపు. ఆ ప్యూరిటే లేకపోతే ఎన్ని చేసినా ప్రయోజనము ఉండదు. అయితే ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క పదార్థము ఒక్కొక్క పరిస్థితి ప్రభావము పురస్కరించుకొని అది కొన్ని మంచి చెడ్డలుగా మారిపోతుంది. ఒక cup of cold water చాలా healthyగా ఉన్నవాడు దాహం వేసేవానికి అందిస్తే చాలా హాయిని ఆనందాన్ని పొందుతాడు. వానికది చాలా ఉపకారము, ఆనందమును అందిస్తుంది. అదే high temperature ఉన్న patientకు cold water ఇస్తే డాక్టరుగారు ఇవ్వవద్దని అడ్డు చెప్తారు. దీనివలన న్యుమోనియా రావచ్చు. ఈ cup of cold water ఒకరికి ఉపకారము చేస్తుంది. మరొకరికి అపకారం చేస్తుంది. అదేవిధముగా వారి వారి పరిస్థితుల ప్రభావాన్ని చిత్తశుద్ధిని, చిత్త మాలిన్యమును పురస్కరించుకొని ఆయా ఫలితములందిస్తూ ఉంటాము.

మానవుడు నేను మానవుడనని అహంకారపడటానికి ప్రయత్నిస్తున్నాడు. దేని వల్ల నీవు అహంకారపడుతున్నావు? దేనిని ఆధారం చేసుకుని నీవు అహంకారపడుతున్నావు? నీ ధనము చూసి అహంకార పడుతున్నావా? ఆ ధనము క్షణభంగురము కదలిపోతుంది. పోనీ అందాన్ని చూసి అహంకార పడుతున్నావా? కొంత వయస్సు వచ్చాక ఈ అందమంతా మంచుకరిగినట్లుగా కరిగిపోతుంది. పోనీ బలం చూసి అహంకార పడుతున్నావా? తెల్లవారి పూచిన పూవు సాయంకాలం వాడిపోయినట్లుగా ఇదీ వాడిపోతుంది. పోనీ నీ మేధాశక్తిని, యుక్తిని చూసి అహంకారపడుతున్నావా? నీకంటె యుక్తిగా ఉంటుంది నక్క. కనుక దానికంటె నీవు చాలా తక్కువ వాడివే. కాని ఎక్కువ వాడివి కాదు కదా! ఇంక అహంకారమెలాపడతావు? చాలా దూరంగా వరకు ఆకాశము వరకు ప్రయాణమవుతున్నావని నీ దృష్టిని చూసి నీవు అహంకార పడుతున్నావా? నీ కంటె గ్రద్ద దృష్టి చాలా గొప్పది. చాలా దూరం వెళుతుంది. ఇంక దేనిని

sri sathyasai vachanamrutam

చూసి నీవు అహంకారపడుతున్నావు.

కనుక మానవత్వంలో ఒక్కొక్క event ఉంటుంది. అక్కడ విచక్షణా జ్ఞానం ప్రత్యేకంగా ఉండాలి. ఒక పిచ్చివాడో లేక చిన్న పిల్లవాడో ఒక ఇంటిలో దూరి ఏమైన సామాను ఎత్తుకుపోతే ఆ ఇంటివాడు పోలీసు complaint చేసి ఆ పిల్లవానిని arrest చేయిస్తాడు. ఇది మానవత్వానికి విరుద్ధమైనది. అదే ఇంటిలో బజారుపోయే కుక్క వంటఇంటిలో దూరి అంతా తినేసి పాత్రలంతా చిందరవందర చేసి వస్తుంది. కాని ఆ కుక్కను పోలీసులు అరెస్టు చేయటం లేదు. ఎన్ని విధములైన అల్లర్లు చేసి వచ్చినా ఆ కుక్కను ఎవ్వరూ అరెస్టు చేయరు. ఏ Law దానిని శిక్షించదు. అనగా కుక్కకు అది సహజము. మానవునికే దొంగతనము చేయటం అసహజము. ఈ అసహజమైన దానిని నీవు చేశావు. కనుకనే నీకు శిక్ష పడుతుంది. అది పశువు. దానికి విచక్షణా జ్ఞానము శూన్యము. విచక్షణా జ్ఞానమున్న మానవుడు యే కించిత్ తప్పు చేసినా అది దోషమవుతుంది.

ఒక డాక్టరు ఉంటాడు. మంచి పేరు పొందిన డాక్టరు. ఇతను ఆపరేషన్‌లో చాలా ప్రఖ్యాతి పొందిన డాక్టరు. అయ్యా! నీకు next monday ఫలాని టైముకి 8 గంటలకు ఆపరేషన్ చేస్తానని date fix చేస్తాడు. బంధువులంతా వస్తారు. ఆ 8 గంటలకు ఆపరేషన్ చేస్తాడు. ఆ పేషెంట్ పోతాడు కాని పబ్లిక్‌గా చెప్పి యింతపని చేసినా పోలీసులు ఆ డాక్టరును అరెస్టు చేయరు. అదే ఒక రోడ్డుపై కిల్లీ కొట్ల వాళ్ళు కొట్లాడుకుంటారు. ఆ కొట్లాటలో ఒక చిన్న గాయమైందంటే వెంటనే పోలీసులు వచ్చివానిని అరెస్టు చేస్తారు. అనగా వాడు కత్తి పట్టటానికిగాని, చిన్న గాయమైన చేయటానికిగాని రైట్ లేదు. డాక్టరుకు రైట్ ఉంది. అదే విధముగా భగవంతుని అనుగ్రహం పొందటానికి రైట్ పొందాలి. ఆ రైట్ ఉండినప్పుడే నీవు ఫైట్ చేయటానికైనా వీలవుతుంది.

**అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం.**

నిరంతరము దైవచింతన చేస్తూ, ఏ జనుడైన సరే no caste, no religion ఎవరైన సరేకాని ఏ నామముతో స్మరించినాగాని ఆ నామము ఎప్పుడూ చింతిస్తూ ఉండాలి. అలాంటి

srisathyasai vahinamrutam

వారి యోగక్షేమము నేనే చూసుకుంటాను. అలాంటి అనన్య భక్తిని మనం అభివృద్ధి చేసుకోవాలి. కష్టమురాని నష్టమురాని, ఆనంద మనుభవించనీ ఏది వచ్చినా ఇదంతా నీ యొక్క ప్రసాదమనే భావము రావాలి.

**సర్వ సమర్పణ భావం ఉండాలి**

అందువల్లనే అన్నీ భగవంతునికి అర్పితము చెయ్యాలి. లోకములో అనేక ధర్మాలు ఉంటున్నాయి. ఈ ధర్మములనేదానికి ఏమి కారణం? హృదయ పరిశుద్ధతే కారణం. ఒక రూపాయకు ఎన్ని పైసలు! నూరు రూపాయలకెన్ని నయాపైసలు? పదివేల నయాపైసలు. పదివేల నయాపైసలు నువ్వు తీసుకువెళ్లాలంటే ఎంత పెద్ద bundle అవుతుంది. అది మోయ్యాలి. ఎంత కష్టమవుతుంది. దాని దాచుకోవటం కూడా కష్టమే. నీవు ఈ పదివేల నయాపైసలు నాకందించు. నూరు రూపాయలనోటు తీసుకో. ఈ పదివేలనయాపైసలు, నూరురూపాయలనోటు రెండు ఒకే value. నూరు రూపాయల నోటు దాచుకోవటము easy. అది లైట్‌గా ఉంటుంది కనుక పదివేల నయాపైసలు వెయిట్ దాచుకోవటము సాధ్యం కాదు. అది చాల బరువు. రెండు విధాలా బాధలు పెడుతుంది. కనుకనే సర్వధర్మాన్ పరిత్యజ్య. నీవు అనేక ధర్మములనే ఈ పదివేల నయాపైసలు నాకిచ్చివేయి. యోగక్షేమం మహామ్యహామ్. నూరు రూపాయల నోటు నీకిస్తాను అని భగవంతుడెంతో ప్రేమతో చెప్తే మూర్ఖులు ఈ పదివేల నయాపైసలు మోసుకుని పోతుంటారు. కాని ఈ రీతిగా స్టడీగా ఉంటే నూరు రూపాయల నోటును వాడే మాత్రం అంగీకరించడు. ఈ నూరు రూపాయల నోటు నీ దగ్గరుంటే పదివేల నయాపైసలు నీ దగ్గర వున్నట్లే. భగవంతునికి సంపూర్ణముగా అర్పితము చేస్తే అన్నీ తానే చూచుకుంటాడు.

కానీ అది మానవునికి చేతకాదు. కారణమేమిటి? ఈ లౌకిక జగత్తునందు, ఈ భౌతికమైన జీవనంలో ప్రారంభమైన ఆనందాన్ని అనుభవించాలని అభిలషిస్తున్నాడు. ఈనాటి మానవునియొక్క పరిస్థితి ఏవిధంగా ఉన్నదంటే కారులో కూర్చుంటాడు. డ్రైవరుకు సరండర్ అవుతాడు. హాయిగా నిద్రపోతాడు. వాడు ఎక్కడకు తీసుకుపోతాడో, ఎలాపోతాడో తెలీదు. పూర్తిగా వానికే సరండర్. నాయనా! మంచిగా తీసుకుపో అంటాడు. కూర్చుంటాడు. బాగా

srisathyasaivachanamrutam

నిద్రపోయేముందు గూర్ఖాకు సరండర్ అవుతున్నాడు. తలుపువేసుకుని చక్కగా పడుకుంటాడు. ఒక గూర్ఖాకు సరండర్ అవుతున్నాడు. ఒక డ్రైవరుకు సరండర్ అవుతున్నాడు. మంచి విలువైన వస్త్రాలిచ్చి చాకలి వానికి సరండర్ చేస్తున్నాడు. ఒరేయి మంచిగా ఉతుక్కొని రారా అంటాడు. కాని భగవంతునికి సరండర్ కావటానికి ముందుకు రావటం లేదు. ఇదే ప్రాకృతమైన మహత్తర మైన శక్తి పట్టి పీడిస్తున్నది. చూశారా! లోకములో ప్రతి చిన్న విషయములో మనము విచారణ చేస్తే ఎంత తక్కువ స్థాయికి దిగజారిపోతున్నాడు.

### సమాజంలో మీరు ఒక భాగమే

ఈ విచక్షణా జ్ఞానంలో ఎవరు మనకు రక్షకులు? ఎవరు మనకు శిక్షకులు? నేనెవరు? తానెవరు? నేను అనేది ఎక్కడ నుండి వచ్చింది? తాను లేకపోతే నేనెక్కడ? ఈ విధమైన విచారణ చేయటానికి ఏమాత్రం పూనుకోవటం లేదు. మానవత్వములో విజ్ఞానము క్షీణించి ప్రాకృత సుఖములనే ఆధారం చేసుకొని ఈ జగత్తులో కాలాన్ని గడుపుతున్నారు. ఇది మానవత్వానికి సరియైన లక్షణం కాదు. నీవు జీవించవలసినదే. కోరికలు కోరుకోవలసిందే. యోగక్షేమాన్ని ఆశించవలసిందే. ఇవన్నీ తప్పులు కావు. అయితే ఏ విధముగా ఆశించాలి. దానికి తగినట్లుగా మనం విచారణ చెయ్యాలి. దానికి విరుద్ధంగా మనం ప్రవర్తించినప్పుడు మానవత్వమే క్షీణించి పోతుంది. మనము ఒక పండు తింటాము. ఆ పండు సరియైన రుచి లేకుంటే మనం ఏమి చేస్తాము. బయట పారవేస్తాము. మంచిగా ఉంటే లోపలకు పంపిస్తాము. అదే విధముగా ఈ సమాజమునందు కూడా సమాజమునకు తగిన రీతిగా నీవు ఉంటే ఆ సమాజము కూడా నిన్ను గౌరవిస్తుంది. ఆ సమాజమునకు తగినట్లుగా నీవు ప్రవర్తించకపోతే ఆ సమాజం నుండి నిన్ను దూరము చేస్తుంది. కనుక మానవునికి ఈ సొసైటీలో తాను ఏ విధమైన ప్రవర్తనతో జీవించాలనే సత్యాన్ని గుర్తించాలి. కనుక సమాజం లేకుండా మనము క్షణమైనా జీవించలేము.

ఈ సమాజములో మనం జీవిస్తున్నాము. సమాజ పౌరునిగా మనం బ్రతుకుతున్నాము. కనుక మనం ఈ మానవత్వాన్ని చక్కగా పోషించుకోటానికి ప్రయత్నించాలి. భగవంతుడు సాక్షీభూతుడేకాని వానికి ఆగ్రహం కాని అనుగ్రహం కాని రెండూ లేవు. రెండూ అందించేవాడు

sri sathyasai vahini amrutam

భగవంతుడు. ఒకటి ఉంటున్నది ప్రత్యేకంగా అతనికి అదే గ్రేస్ మార్క్సు అంటారు చూడండి. అలా అతను ఏదైనా చేయవచ్చును. చూడండి మన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి గ్రేస్ మార్క్సు అని కొన్ని ఉన్నాయి. వైస్ ఛాన్సలర్ గ్రేస్ మార్కులని కొన్ని ఉన్నాయి. ఇంక చదవనక్కరలేదు. అన్ని గ్రేస్‌మార్కులే. ఈ విధముగా కాదు దైవత్వంలో ఉండేది. తన ప్రవర్తన పురస్కరించుకొని గ్రేస్ వస్తుంది. భగవంతుడు ఆగ్రహించినట్టుగా నటిస్తాడు. కానీ ఆగ్రహము కూడను అనుగ్రహమే. వర్షం కురుస్తూ ఉంటుంది. వర్షములో వడగళ్లు పడతాయి. ఆ వడగళ్లు చాలా బాధపెడతాయి. అవి కూడా వాటరే. చూశారా ఆ మాటలు, పనులు కొంచెం కఠినంగా ఉంటాయి గాని అది సరే. కనుక దైవానుగ్రహమనేది ఆగ్రహములో కూడను అనుగ్రహమే ఉంటుంది. కనుక మానవుడు చేసే ప్రయత్నములు సాధనలు పురస్కరించుకొని గ్రేస్ అనేది స్పెషల్‌గా ఉంటుంది.

**భగవదనుగ్రహము శక్తివంతమైనది**

మీకందరికి తెలుసు. మార్కండేయునకు భగవంతుడే 16 ఏళ్లు సత్పుత్రుడుగా జీవించమని వరమిచ్చాడు. మార్కండేయుడు చింతించాడు. నా జీవితము 16 సంవత్సరములు మాత్రమే. నేను సత్పుత్రునిగా బ్రతకాలి. అనే ఉద్దేశ్యముతో ఈ సన్మార్గము, సద్భావములు, సదాచారములు, సద్గుణములు ఏవిధంగా అలవడతాయి. మహాగుణవంతుడు భగవంతుడొక్కడే. కనుక అతనినే ఆశ్రయిస్తే అతను నాకనుగ్రహిస్తాడు. భిక్షగాని దగ్గరకు పోయి నాకు భిక్షము వేయమంటే వాడు యేమి వేస్తాడు. వాని దగ్గర ఉండేవి వట్టి కుండలే. కనుక ఈ గుణవంతుని పోయి ఆశ్రయించినప్పుడు ఆ గుణములు మనకు అందించటానికి వీలవుతుంది. ఈ discrimination మొట్టమొదట ఉపయోగపెట్టాడు మార్కండేయుడు. మాకు నీవు తప్ప అన్యము లేదు అని అప్పుడు పోయి ఈశ్వరుని ప్రార్థించాడు. తానే ఇచ్చాడు. ఈ పదహారు సంవత్సరములుకూడా ఆ మార్కండేయుడు చేసిన సాధనలు పురస్కరించుకొని, ఉత్తమమైన చిత్తము సాధారము చేసుకొని తిరిగి చిరంజీవిగా తానే మార్చాడు. అదే గ్రేస్ మార్క్సు. భగవంతునియొక్క సంకల్పము మార్చటానికి వీలుకాదు. తాను ఇచ్చిన వరము తప్పించటానికి వీలుకాదు. ఎవరికి కనుక కర్మ తప్పించుకోటానికి వీలుకాదని భావించుకోవచ్చు. కానీ ఒక్క

sri sathyasai vachanamrutam

భగవంతునికే ఇది సాధ్యము. అట్టి గ్రేస్‌ను మనము సంపాయించుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

ఈనాడు ఏమి చేస్తున్నాము? అయ్యో నేను పూజ చేస్తున్నాను. నేను ఎంతో చింతిస్తున్నాను. నేను ప్రేమిస్తున్నాను. అవి తనకు తాను మాత్రమే వర్తించుకుంటూ measure చేసుకుంటున్నాడు. నీయొక్క దీనిని నీవు measure వేసుకుంటున్నావు. దీనికొక reason ఉంటున్నాది. కాని భగవంతుని ప్రేమించటం దీంట్లో ఆ reasons ఇక్కడంతా పనికిరావు. ఎట్లా ఉందంటే ఒక పద్యము ఉంటున్నాది.

**అక్కరకు రాని చుట్టము**
**మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున తా**
**నెక్కిన బారని గుఱ్ఱము**
**గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!**

అన్నారు. మ్రొక్కితే వరమీయని దైవము, ఎక్కుతే పరుగెత్తని గుఱ్ఱము కష్టములో ఆదుకొనని బంధుత్వము గ్రక్కున విడువమన్నారు. ఎవరికి చెప్పిఉండేది ఇది. అది మనము యోచించటం లేదు. వారు వచ్చి నన్ను ఆదుకోలేదే అని బాధ పడతాము. మంచిగా డబ్బిచ్చి గుఱ్ఱాన్ని తెచ్చుకుంటే గుఱ్ఱము పైన ఎక్కుతే ఇది పరుగెత్తటం లేదే అని దానిని కొడతాం. కట్టకడపటికి చెప్పాడు సుమతి. మంచి మనసు కలవానికి ఈ మూడు పనిచేస్తాయి. మంచి మనసు కలిగినటువంటి వాడు తను చేసేటువంటివి ఏ పనులు మంచి పనులా చెడ్డపనులా అని తెలుసుకుంటాడు. మంచి మనస్సు కలవాడు భగవంతుడు నన్ను శిక్ష వేస్తున్నాడే అని అతనిని వదలిపెట్టడు. మంచి మనసు కలవాడు దైవమును యేనాడు వదలడు. మంచి మనసు కలవాడు సవారి తెలియకుండా గుఱ్ఱమును ఎక్కడు. మంచి బుద్ధిగలవాడు చెడ్డపని చేసి బంధువులంతా సహాయము చేయలేదని వారిని విసర్జించరు. మొట్టమొదట మంచి మనస్సును మనము పెట్టుకోవాలి. సు.మ.తి. మంచి మనస్సు, కుమతి కాదు. కనుక ఆ మంచి మనస్సు తెచ్చుకోవటానికే దైవత్వమును కొంతవరకు ఆశ్రయించాలి. భగవంతుడు ఎప్పుడూ కూడా సాక్షీ భూతముగా ఉంటాడు.

ఒక్కొక్క తూరి మీకేమైనా లెటరు వచ్చిందంటే లేక టెలిగ్రాము వచ్చిందంటే చెడ్డ టెలిగ్రాము

sri sathyasaivachanamrutam

వచ్చింది. ఆ పోస్టుమెన్‌తో మీరు మంచి సంబంధము పెట్టుకుంటే మంచిగా వచ్చి ఆ చెడ్డది కూడను మంచి మాటలతో బోధిస్తాడు. అట్లు కాకుండా మీకు జాబు వచ్చింది అని ఇస్తే మీరు గొల్లుమని ఏడుస్తారు. టెలిగ్రాము ఇచ్చి సార్ కనుక్కోండి. టెలిఫోను చేసి తెలుసుకోండి అని idea వాడు ఇస్తాడు. అదే విధముగా దైవము తగిన సలహాలు ఇస్తూ ఉంటారు. ఇది చేయటము నీకు చాలా తప్పు. నేరోమైండులోనే దీనిని సత్యమని భావించుకొని దానిని ప్రవర్తిస్తున్నావు. ఎవరిది వారికి కరెక్టుగానే ఉంటుంది. కాని God correct చేస్తూ ఉంటాడు. అతని చేతికి ఇస్తేనే సరియైన రీతిగా ఇస్తాడు. కనుక నీ అంత నీవే నిర్ణయించకోకూడదు.

**శరణాగతి**

దైవార్పిత మనే భావముతో మనం జీవించటానికి ప్రయత్నించాలి. ఒక చిన్న ఉదాహరణము రామునితో లక్ష్మణుడు బయలుదేరి వెళ్ళాడు. రామునికి మాత్రమే మూడు ఆజ్ఞలు ఇచ్చాడు. కైకకు ఇచ్చిన వరము కోసము 14 ఏండ్లు అరణ్యములో ఉండాలి. నారవస్త్రములు ధరించి వెళ్ళాలి అడవికి. కాని లక్ష్మణునకు ఈ విధమైన నిబంధనలు ఏమి లేవు. అతను ఏ దుస్తులైనా వేసుకోవచ్చును. ఇష్టము వుంటే పోవచ్చు లేక ఉండవచ్చు. కానీ రాముని పైనఉండే ప్రేమచేత రాముడు లేని అయోధ్య నాకు కేవలము అరణ్యమే అనుకున్నాడు. రామునితో ఉంటే అరణ్యమే నాకు అయోధ్య అనుకున్నాడు. రాముడు నారవస్త్రములు ధరించుకుంటే తాను పట్టు వస్త్రములు ధరించి పోతాడాపోడు. ఆ స్వామికి ఏ మార్గమో నాకు అదే మార్గము అనుకున్నాడు. రాముడు ఏ విధంగా ఉంటే నేను అదే విధంగా పోవాలి. అతని ఇష్టాన్ని నేను అనుసరించాలి. రాముడు అంగీకరించలేదు.

లక్ష్మణుడు నమస్కారము చేశాడు. అన్నా నీవు లేని బ్రతుకు నాకక్కరలేదు అన్నాడు. నాకు ఇల్లాలు ఉంది. నాకు రాజ్యము ఉంది. నాకు పిల్లలు ఉన్నారు. కానీ నాకు నీవే నా సర్వస్వము. కనుక నీ వెంట వస్తాను. నీవు అంగీకరించకుండా పోయిన ప్రాణము విడుస్తాను గాని నేను అయోధ్యలో ఉండను. దానిని పురస్కరించుకొని రాముడు అనుమతించాడు. చిత్రకూట పర్వతము పైన దిగారు. ఎన్నడూ నడవని రాజకుమార్తె సీత నడచి నడచి అలసిపోయారు.

sri sathyasai vachanamrutam

రాముడు లక్ష్మణుని పిలిచాడు. సోదరా! సీత అలసిపోయినట్లుగా ఉంది. పర్ణశాల నిర్మించు ఆమె విశ్రాంతి తీసుకుంటుంది. లక్ష్మణుడు అడిగాడు. అన్నా ఎక్కడ నిర్మించాలి. నీకు ఎక్కడ ఇష్టమో అక్కడ నిర్మించు అన్నాడు. ఒక్క తూరి కూలిపోయాడు లక్ష్మణుడు. నేనెంత పాపము చేశాను అని తలకొట్టుకున్నాడు. ఆశ్చర్యపడింది సీత. ఏమన్నాడు రాముడు ఏమి చెప్పలేదేనీకు. ఇష్టమైనచోట నీవు నిర్మించమన్నారేగాని నీవు ఎందుకింత బాధపడుతున్నావు. లక్ష్మణా' అని అడిగింది. ఈ మాట చాలదా! నాకు యిష్టము ఉంటుండాదా! నాకు ఇష్టమే లేదు. నీ ఇష్టమే నా ఇష్టము. కాబట్టి నాకొక ఇష్టమున్నదని రాముని నోటినుండి వచ్చిందంటే నేను ఎంత పాపము చేశానో నేను ఏ రీతిగా శరణార్థిని అవుతాను. నాకు ఇష్టము ఉంటే శరణాగతే కాదు. నాకు ఇష్టము లేదు. నీ ఇష్టమే నా ఇష్టము. ఆ భావమును పురస్కరించుకొని రాముడు దగ్గరకు పిలిచి లక్ష్మణా పొరపాటై పోయింది తప్పునాది నన్ను క్షమించమని కోరాడు. అంత భగవత్ భక్తుని తత్త్వము చక్కగా తెలుసుకున్న భగవంతుడు తప్పక తానే వశమైపోతాడు.

ఎక్కడ అహంకారము, ఆడంబరము ఉంటుందో అక్కడ తాను కూడ అదేవిధముగా ఉంటాడు. కనుక యద్భావం తద్భవతి. ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు అన్నాడు అన్నమాచార్య. కనుక నీ తలంపు మీద ఆధారపడి ఉంటున్నదిగాని భగవంతుడుయొక్క సంకల్పముపైన కాదు. ప్రపంచమంతా నిలువుటద్దమువంటిది. నిలువుటద్దము ముందు నాలుగు తూర్లు ఇట్లే అను అదికూడా అంటుంది. నీవు నిలువుటద్దము ముందు పోయి నమస్కారము చేయి నమస్కారం తిరిగి నీకే అందిస్తుంది. కనుక ప్రపంచమనే అద్దము లోపల నీవు యేమి చేస్తున్నావో అది Resound reflection నీకే వస్తున్నాయి. నీవు మంచిని చేసి, మంచిని చూసి, మంచిని తలచి, మంచిని చెప్పి మంచిగా ఉండు. ఇదే మానవత్వానికి సరైన అర్థము. ఈ విధమైన శరణాగతి తత్త్వము లోపల మానవత్వము కొంతవరకు అధికారముంటుండాది. అయితే ఏది చేసిన సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థము అనే భావముతో చేయి.

అట్లు కాకుండా మంచి జరిగింది. అది నాశక్తి ప్రభావము, చెడిపోయింది. అది దేవునిది. తెలుగులో చెప్తూ ఉంటారు. పెళ్లిపందిరి వేస్తున్నాడు లోభి. సరే దానికి కట్టటానికి త్రాడు

srisathyasaivachanamrutam

పెద్దపెద్దవైతే ఖర్చువుతుందని చాలా చిన్న చిన్న త్రాళ్లతో పెండాలు కట్టారు. గాలి వచ్చింది. అది పడిపోయింది. ఈ పెండాలు పడిపోయింది. పంచాంగము వానిని పడగొట్టరా అన్నాడుట. పంచాంగము వానిది తప్పుయిపోయింది. ముహూర్తము పెట్టింది తప్పైపోయింది. తల్లిబిడ్డ మీద ప్రేమతో బిడ్డను ముద్దుపెట్టుకోవాలని బిడ్డను కొరికేస్తే. కనుక బిడ్డను ముద్దుపెట్టుకోటానికి ప్రమాదము కలగకుండా ఉండేరీతిగా చూసుకోవాలి. అదేవిధముగా శ్రమ కలిగించేది, బాధ కలిగించేది. ప్రేమ ఎట్లా అవుతుంది. I Love I Love అని గ్రామఫోను ప్లేటులా రిపిటిషను చేస్తే ఏమిలాభము ప్రాక్టికల్‌లో నిరూపించాలి. లేకపోతే నిరుపయోగమైపోతుంది. గ్రామఫోను ప్లేటు లోపల ఒకామె ఏడుస్తూ పాడుతుంది. కానీ వినేవానికికూడా కండ్లలో నీరు వస్తుంది. కాని గ్రామఫోను ప్లేటు ఏడ్వదు. అదేరీతిగా మన ప్రేమకూడను I Love అంటే words మాత్రము గ్రామఫోను మాదిరి. దీనికి ఏ మాత్రము Love లేదు. Practicalలో చూపించాలి. అప్పుడే మానవత్వము చక్కగా తగిన ఆదర్శము నందిస్తుంది.

**కారణములేని కార్యము స్వామి చేయదు**

కనుక విద్యార్థులు స్వామి మమ్ములను శిక్షిస్తున్నాడుగాని, ఆగ్రహించాడనిగాని, అనుగ్రహించాడనిగాని మీరు ఏ విధముగా చింతించరాదు. మీదోషాలను మీరు వెతుక్కోటానికి, ఆ దోషములు లేకుండా ఉండడానికి మీరు చూచుకోండి. ఈ పిచ్చిగుణాలు నాలో లేవు. ఎప్పుడూ నాకు ప్రేమ ఒక్కటే. అయితే re-action మీ దానిని బట్టి నేను ఆ action చేయవలసివస్తుంది. ఆ actionకు మీరే కారకులు. మీ action చక్కగా ఉంటే re-action చక్కగా ఉంటుంది. మొట్టమొదట మీ action సరైన రీతిలో ఉంచుకోవాలి. మీ thoughts సరైన దింట్లో తీర్చి దిద్దుకోండి. ప్రతి దానిని మన దుఃఖమునకు, మన ఆనందమునకు అన్నింటికి మూలకారణము మన మనస్సే. అంతా కూడను లోపలి దానియొక్క ఇదంతా కనుక మీ గిల్టీ కాంషస్‌ను కంట్రోలు చేసుకోండి. దేశకాల పాత్ర స్వభావములను పురస్కరించుకొని స్వామి అందిస్తుంటారు. అప్పటికప్పుడు ప్రతిదానికి ఒక్కొక్క కారణము ఉండాలి. కారణము లేని కార్యము స్వామి చేయదు. స్వామి చేసిన దానికి ఉందని మీరు యోచించాలి. మీరు దీనిని చూడటం లేదు. అదే పెద్ద పొరపాటు. ఎప్పుడు స్వామిలో దయ,

srisathyasaivachanamrutam

ప్రేమ రెండూకూడను సమ్మిళితమై ఉంటున్నాయి. మీ thoughts యొక్క re-actions మీకు ఈ విధమైన పొరపాటు మార్గమును చూపిస్తున్నాయి.

భగవంతుడు ఒకదోభి clean చేయటమే ఇతని యొక్కపని. అద్దము ఏమి చెబుతుంది. నీ reflection చూపుతుంది. నీ రూపము సరిగా లేకుండా పోయి అద్దములో చూసుకొని అద్దము పగలకొడితే, నీ భావమును చూపిందిగాని దాని తప్పు యేమీ లేదు. తన దానిని తాను చక్క చేసుకోవటం మానుకొని అద్దమును పగలగొట్టటము. ఈనాడు భగవంతుడు విశేషమైన అమూల్యమైన గిఫ్ట్ ఇచ్చాడు. బుద్ధి అనే అద్దము మీకందించాడు. నీ ముఖము నీవు చూసుకో నీవు ఘోరంగా ఉంటున్నావా? శాంతముగా ఉంటున్నావా? ఆనందముగా ఉంటున్నావా? అని నీవు దాన్ని చూసుకుంటూ రావాలి. అట్లా చూసుకోకుండా భగవంతుడిచ్చిన బుద్ధిని ఇంకొకరి ముఖముపైన పెడితే వారి ముఖము కనబడుతుందిగాని నీ ముఖము ఎట్లా కనిపిస్తుంది. ఇతరుల దోషములను వెదుకుతూ వస్తున్నారు. ఆ విధముగా ఇతరుల ముఖము కనిపిస్తున్నాది. ఇతరుల ముఖముపై పెట్టవద్దు. ఆ బుద్ధి అనే అద్దమును నీ ముఖముపైన పెట్టు. అప్పుడు నీ దోషము నీకు కనుపిస్తుంది. అప్పుడు నిన్ను నీవు శుభ్రము చేసుకోవచ్చు. కనుక మొట్టమొదట నీ దోషములు నీవు వెదకటానికి ప్రయత్నించు. పరుల దోషము వెదుకుటే పాడు బుద్ధి. నీదోషములను నీవు చూసుకో. జీసస్ కూడా చెప్పాడు. ఇతరుల కంటిలో ఉన్న చిన్న కణము కనుపిస్తున్నాదే. నీకు నీ కంటిలో వున్న పెద్ద గుండు నీకు కనిపించటము లేదు. తెలుగులో కూడా చెబుతారు. తన ఆకులో గాడిదలుపడి భోజనము తింటే కనుపించలేదట. ఇతర ఆకులో ఈగ మాత్రం కనుపించిందట. ఆ విధంగా ఉండకూడదు. మన దోషాన్ని మనం వెతకకూడదు. మన హృదయము మనము పరిశుద్ధము చేసుకోవటానికి చూసుకోవాలి.

**మంచి మనసు దైవపీఠం అవుతుంది**

ఉదాహరణ పిల్లలకు. నీవు ఏదైనా పాత వస్త్రమో మాసిన వస్త్రమో వేసుకొని ఇంట్లో నీవు శుభ్రము చేసుకుంటూఉంటావు. ఎవరైనా ఇంటికి వస్తే తక్షణము లోపలకి పోయి డ్రస్ మార్చుకొని చక్కగా శుభ్రంగా ఇంకొక డ్రస్ వేసుకొని వస్తావు, dirty గా ఉంటుంటే నీవు సరైన స్థితిలో లేకపోతే friends చూస్తేనే నీకు ఇంత అవమాన మవుతుంది. అనుకున్నప్పుడు

srisathyasaivacanamrutam

నీ dirty మనస్సులో ఉన్నప్పుడు ఆ మనస్సు భగవంతుడు చూస్తాడని భయమెందుకు రాకూడదు. నీవు ఎక్కడైన లైనులో కూర్చోవాలంటే లేక ఏదో ఒకటి క్రింద వేసుకు కూర్చుంటావు. ఎందుకు నీకే మాత్రం dust కాకూడదు. నీవు కూర్చుని ఉండాలంటేనే ఇంత పరిశుద్ధమును కోరుతున్నావే భగవంతుడు నీ హృదయములో కూర్చోవాలంటే అక్కడ శుభ్రముగా ఉండవద్దా. భగవంతుడు నీ హృదయములో కూర్చోవాలంటే మొట్టమొదట అది శుభ్రం చెయ్యాలి. అప్పుడు అక్కడకు వచ్చి కూర్చుంటాడు. మైసూరు మహారాజుకు రాజ్యమంతా తనదే. రాజ్యమంతా నాదేనని డ్రైనేజి వాటర్‌లో కూర్చుంటాడా. తాను కూర్చునే సింహాసనము వేరేగా ఉంటున్నది. కాబట్టి అందరి హృదయాలు భగవంతునివే. అందరి హృదయాలు నావేయని dirty హృదయంలో కూర్చోడు. ఎక్కడ పరిశుద్ధముగా ఉంటుందో అక్కడ కూర్చుంటాడు. ఎక్కడ purity healthy ఉంటాయో అక్కడ కూర్చుంటాడు. మ్యూజికల్ చైర్‌లో లాగ కూర్చోడు. అందరి హృదయాలలో కూడా కుర్చుంటాడు. ఎట్లా ఒక వేయి పాత్రలంతా నీటిలో నింపి పెట్టాము. కాని పైన ఒకే చంద్రుడు ఉన్నాడు. అన్ని పాత్రలలోను కనబడుతున్నాడు. అన్ని చంద్రులున్నయా? ఒకే చంద్రుడు అదేరీతిగా ఈ దేహములంతా కుండల వంటివి. మైండ్ అనే జలము అక్కడ ఉంటున్నాది. ఆత్మ అనే తత్త్వము అన్నింటిలోను ఉంటున్నాది. కానీ dirty waterలో సరిగా కనుపించటం లేదు. ఈ వేవరింగ్‌లో ఉంటుంది. చూడండి దాంట్లో కనబడుతున్నట్లుగా కనుపిస్తుంది. Pure and studyగా ఉండే దాంట్లో studyగా ఉంటుంది. Dirty water తమోగుణము. చలించే మనస్సు రజోగుణము Clean water సాత్వికగుణము, అక్కడ మన ప్రతిబింబము చక్కగా కనిపిస్తుంది.

**భగవంతుని మరువకండి**

చూశావా! మీకు స్వామి ప్రత్యేకంగా, పవిత్రముగా కనపడాలంటే cleanగా ఉండాలి. Jumps bumps లేకుండా చూసుకోండి. Waves వస్తుంటాయి Wave ఏమాత్రం చోటు ఇవ్వకూడదు. Waves అంతా కలసి ocean అయిపోతుంది. సంసారం సాగరం విషం. ఒక నామములో ఉంటే steadyగా ఉంటుంది. భగవదర్పితముగా నీ కర్తవ్యము నీవు చేయి. నీ duty నీవు చేసుకో. ఆఫీసుకు పోవద్దని చెప్పను. అన్నం తినవద్దని చెప్పను. డ్రస్

srisathyasaivachanamrutam

వేసుకోవద్దని చెప్పను. మంచిగా భుజించండి. ఆఫీసుకు పొండి. మంచిగా సంపాదించండి. కాని భగవంతుని మరువకండి. Do your duty sincerely అదే స్వామి కోరేది. honestyగా పని చేయి. ఎవరు ఏమన్నా నీవు భయపడవద్దు.

ఒకామె ఎంత ఎలాంటి విచిత్రమైన పరిస్థితులు వచ్చాయో ఏడ్చుకుంటూ వచ్చింది. చెప్పాను don't worry. ఇదంతా mental fear స్వామి ఉన్నాడు. ధైర్యంగా fight చెయ్యి అన్నాను. ఉద్యోగమే వద్దు రిజైన్ చేస్తాననింది. వద్దు వద్దు. దీంతో మనం పోరాడాలి. fight to the end finish the game ఆ మాట పై విశ్వాసముతోనే పోయిచేరింది. ఒక్క ఆడమనిషి కొన్ని వేల మంది మగపిల్లలు చుట్టుకున్నారు. ఏమి చేస్తుందామె. దుర్మార్గము, దుష్టులైన వారి మధ్యలో ఉంది ద్రౌపదివలె. ఎంతమంది ఉంటేయేమి? ఎన్ని కుక్కలు చేరినా ఒక్క సింహానికి సమానమవుతుందా పురుష సింహము ఉన్నట్లు కృష్ణుడు ఉన్నాడు. కుక్కలంతా ఎలా ఉంటాయి. ఆ విధంగా జయించుకుని వచ్చిందామె. ఒక తూరి Teachers conference జరిపింది. ఆమె డైరెక్టరుగా ఉన్నప్పుడు కర్నాటకలో అంతా వచ్చారు. నాపేరు ఎక్కడ ఎప్పుడు చెప్పకండి. ఎందుకంటే అన్ని రకాలుగా ఉంటారు. టీచర్సు యోగులు, భోగులు, విరాగులు బైరాగులు అందరూ ఉంటుంటారు. అక్కడ నాస్తికులు, ఆస్తికులు, యాస్తికలు అందరూ ఉంటుంటారు. ఆ టీచర్సుతో చెప్పాను. ఎడ్రస్సు చేయి స్వామి అట్లా ఇట్లా అని చెప్పవద్దు. చెప్పింది. నా విశ్వాసమును నేను గట్టిగా చెప్తాను. నేను భయపడనని He is my Sai Govinda. నేను ఎవరి కోసం భయపడను. భయపడితే భక్తే కాదు. భయపడితే భక్తి ఉండదు. ఎవరైన అనుకోనీ నాభక్తి నాది. నాకు మైండ్ ఉంది నాకు intellect ఉంది నాకు desire ఉంది నా desire నేను follow చేస్తాను. నా mind నేను follow చేస్తాను. ఇంకొకరి mind follow చేయను. గట్టిగా చెప్పింది. ఈ టీచర్సంతా సంతోషించారు. తరువాత చెప్పారు. ఇంకో conference పెట్టమని అడిగారు వాళ్ళు. ఆ కన్ఫరెన్సు ఆమెను అన్ని విధములా రక్షిస్తూ వచ్చింది. ఇక్కడ యించి యించికి క్షణక్షణానికి ఎక్కడపోయిన ధార్వార్, హుబ్లీ అక్కడ అంతా చెబుతారు. సార్ పోవద్దండి బాబు అని చెబుతారు. నా సాయి గోవిందుడు. నా వెంటఉన్నాడు నేను పోతాను. అందరిని పిలిచి strike కారణం ఏమిటి చెప్పండి అన్నది. ఈ మగధీరులంతా ఉన్నారు. ఎవరికి వారే. మగవారు ఆడబుద్ధులు వారివి. ఆమె

sri sathyasaivachanamrutam

ఆడది గాని మగవాని బుద్ధులు. ఆ విధముగా సాధించుకుని వచ్చింది. రూపాలనుబట్టి కాదు. స్త్రీ పురుషులు. అందరు actors.

ఒక girls college లో ఒక డ్రామా వేస్తారు. రాజు కూడను అమ్మాయే వేస్తుంది. మినిష్టరు కూడా అమ్మయే వేస్తుంది. అందరూ అమ్మాయిలే వేస్తారు. కాని stage కి మాత్రమే అక్కడ రాజురాణి. తెరవెనుక అందరూ రాణులే. అందరు ఆత్మ స్వరూపులే. ఉపాధి బేధములు పురస్కరించుకొని స్త్రీ పురుషులు గాని అందరు ప్రకృతి యొక్క స్వరూపములే. ఏడుపు వస్తే వారు ఏడుస్తారు. వీరు ఏడుస్తారు. ఆకలి వేస్తే వారు తింటారు. వీరు తింటారు. కోపము వస్తే ఆయన కోప్పడతారు. ఈమె కోప్పడుతుంది. difference ఏమిటి? అందరికి weakness ఉంది. అందరు అబలలే. ఎవరు బలులు లేరిక్కడ. బలుడు ఒక్కడే. అతనే భగవంతుడు. కాబట్టి సర్వబలములు అనుగ్రహించే స్వరూపుని ప్రార్థించండి. బుద్ధిబలము, భుజబలము, జ్ఞానబలము వైరాగ్యబలము, సర్వబలములు అక్కడే ఉంటున్నాయి. అందువల్లే ఈశ్వర అన్నారు. ఈశ్వర అనగా సకలైశ్వర్య స్వరూపుడు. అన్ని బలములు అతనిలో ఉన్నాయి. కనుక భగవంతుని ప్రార్థించి మీ బాధలు నివారణ చేసుకొని శాంతి సౌఖ్యలతో సంతోషంగా జీవించండి.

**(తేది. 31-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam